

దుర్మార్గంగా జగన్ పాలన

నాలుగున్నరేళ్లలో అనేక రెట్లు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు

- విద్యుత్ చార్జీలు ఐదు రెట్లు పెంపు
- నాసిరకం మద్యం అమ్మకాలతో 35 లక్షల మంది అనారోగ్యంపాలు
- అరకు సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ధ్వజం
- టీడీపీ ప్రభుత్వం అరకు కాఫీని ప్రమోట్ చేస్తే... వైసీపీ గంజాయిని ప్రమోట్ చేసిందని విమర్శ
- మన్యంలో లేటరైట్ పేరిట బాక్సైట్ దోపిడీ
- కులం, మతం పేరుతో జగన్ చేస్తున్న మోసాలకు ఎవరూ బలికావద్దు
- రుషికొండకు బోడిగుండు కొట్టించారు... మరోసారి వస్తే అరకు కొండలకు గుండుగీత
- గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక, నిధుల కేటాయింపు



డుంబ్రిగుడ మండలం జైపూర్ జంక్షన్‌లో రా.. కదలిరా సభకు హాజరైన జనం
మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

డుంబ్రిగుడ/పాడేరు/అరకులోయ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి పాలన ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి దుర్మార్గుడిలా ప్రవర్తిస్తున్నారని తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మండిపడ్డారు. 'రా...కదలిరా' పేరుతో శనివారం మధ్యాహ్నం అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం అరకులో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. నిత్యం బటన్ నొక్కుతానని సీఎం చెబుతుంటారని, దానివల్ల ప్రజలకు ఇచ్చేది పిసరంత... ఆయనకు మాత్రం లాభం కొండంత అని విమర్శించారు. ఐదేళ్లలో నిత్యావసర

... మిగతా 6వ పేజీలో

చంద్రబాబుకు బ్రహ్మరథం

- అరకులో 'రా...కదలిరా' సభకు అశేషంగా తరలివచ్చిన జనం


- I పేజీలో

అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొర

- ప్రకటించిన చంద్రబాబునాయుడు

వాసుపల్లికి కార్పొరేటర్ల షాక్

సమీక్షకు గైర్హాజరు...కేవలం ఒకే ఒక్కరు హాజరు




విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్‌పై సొంత పార్టీలోనే వ్యతిరేకత పెరుగుతోంది. ఆయనకు వ్యతిరేకంగా మొన్నటికి మొన్న నలుగురు (ఉరుకూటి నారాయణరావు, బిపిన్ కుమార్ జైన్, చెన్నా జానకీరామ్, విల్లూరి భాస్కరారావు) కార్పొరేటర్లు...ఇటీవల పార్టీని వీడిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరయ్యారు. ఆ నలుగురినీ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు నేతలు ప్రకటించారు.ఇదిలావుండగా

... మిగతా 6వ పేజీలో

ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్ సినీ పరిశ్రమకు రెండు కళ్లు

వారి సహకారంతోనే ఈ స్థాయికి వచ్చా: చిరంజీవి



రుషికొండ ఏ1 గ్రాండ్ కన్వెన్షన్‌లో ఎన్టీఆర్, ఏఎన్నార్, హరివంశరాయ్ బచ్చన్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న చిరంజీవి, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తదితరులు

- వార్త చిత్రజ్యోతిలో..

పుంజుకున్న పర్యాటకం

పెరిగిన సందర్శకులు

- ఉమ్మడి విశాఖ జిల్లాకు 2023లో 1.71 కోట్ల మంది రాక
- సగటున రోజుకు 47 వేల మంది రాక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటకం కొత్త పుంతలు తొక్కుతోంది. కరోనా కారణంగా రెండేళ్లు పడకేసిన ఈ రంగం 2023లో ఊహించని విధంగా పుంజుకుంది. గత జనవరి నుంచి డిసెంబరు వరకు పన్నెండు నెలల్లో 1,71,78,184 మంది పర్యాటకులు ఉమ్మడి జిల్లాను సందర్శించారు. అంటే రోజుకు సగటున 47 వేల మంది చొప్పున నెలకు సుమారుగా 15 లక్షల మంది విచ్చేశారు. విదేశీ ప్రయాణికుల సంఖ్య 40,749గా నమోదైంది. కరోనాకు ముందు సింగపూర్, దుబాయ్, మలేషియా, శ్రీలంక దేశాలకు విశాఖ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు ఉండేవి. కరోనా తరువాత సింగపూర్ సర్వీసును మాత్రమే పునరుద్ధరించారు.మిగిలిన మూడు సర్వీసులు నిలిచిపోయాయి. అయినాసరే విదేశీ పర్యాటకుల సంఖ్య బాగా పెరిగింది.



బీచ్‌రోడ్డులోని కురుసుర మ్యూజియం వద్ద క్యూలైన్లో వేచి ఉన్న పర్యాటకులు

ఆకర్షిస్తున్న కొత్త ప్రాంతాలు

కరోనా తరువాత చాలామంది వ్యక్తిగత జీవితానికి కొంత సమయం కేటాయిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పర్యటనలకు వెళ్లడం ప్రారంభించారు. ఇదే సమయాన అల్లూరి సీతారామరాజు జిల్లాలో శీతాకాలం ఎక్కడికక్కడ అందమైన మేఘాలు ఆవిష్కృతం కావడం, అవి సోషల్ మీడియా ద్వారా జనబాహుళ్యం దృష్టికి వెళ్లడంతో 'ఛలో ఏజెన్సీ' అంటూ అంతా వాహనాల్లో

... మిగతా 6వ పేజీలో

2023లో నెలల వారీగా పర్యాటకుల లెక్క

నెల	దేశీయ పర్యాటకులు	విదేశీ పర్యాటకులు
జనవరి	15,24,303	2,416
ఫిబ్రవరి	12,47,028	3,665
మార్చి	12,92,904	3,881
ఏప్రిల్	13,97,610	3,141
మే	14,62,051	3,158
జూన్	14,55,946	2,476
జూలై	15,61,177	3,157
ఆగస్టు	13,57,313	2,553
సెప్టెంబరు	12,40,029	2,484
అక్టోబరు	16,33,198	3,551
నవంబరు	14,31,131	4,370
డిసెంబరు	15,62,745	5.697

ఏయూ వీసీగా ప్రసాదరెడ్డి బాధ్యతలు స్వీకారం



ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా రెండవ సారి బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి

- I పేజీలో

మందకొడిగా కులగణన

మొరాయిస్తున్న సర్వర్లు

- పౌరుల వివరాలు అప్‌లోడ్‌కు సిబ్బంది కష్టాలు
- కొన్నిచోట్ల ఇళ్లకు రాని సిబ్బంది
- రెండు రోజుల్లో 9.21 శాతం మంది వివరాలు సేకరణ

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సర్వర్లు మొరాయిస్తుండడంతో కులగణన మందకొడిగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సర్వే జరుగుతుండంతో సర్వర్‌పై ఒత్తిడి ఎక్కువైంది. దీనికితోడు కొన్నిచోట్ల సిగ్నల్ సమస్య తలెత్తుతోంది. దీంతో వివరాలు అప్‌లోడ్‌కు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన కులగణన ఈనెల 28వ తేదీ వరకు జరగనున్నది. మొత్తం 607 వార్డు/గ్రామ సచివాలయాల పరిధిలో 7,15,260 ఇళ్లలో ఉంటున్న 21,47,507 జనాభాను సర్వే చేయాల్సి ఉంది. సచివాలయ అధికారులతోపాటు ఆ ప్రాంతానికి చెందిన వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కులాల వారీగా వివరాలు సేకరించాలి. వివరాలు సేకరించేటప్పుడు సదరు వ్యక్తితోపాటు సర్వేకు వెళ్లిన

... మిగతా 6వ పేజీలో

నేడు మర్రిపాలెంలో రామలీల పరస

మర్రిపాలెం, జనవరి 20: రామలీల పరస మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పరస సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.



డాబాగార్డెన్స్ పోస్టాఫీస్ వీధిలో రహదారిపైనే చెత్త కుప్పలు



సీతమ్మధార పరిధి నక్కవానిపాలెం వద్ద పేరుకుపోయిన చెత్త

సమ్మె ముగిసినా చెత్త తొలగించరా?

» వార్డుల్లో పలుచోట్ల పేరుకుపోయిన వైనం

» దృష్టి సారించని యంత్రాంగం

కంచరపాలెం, జనవరి 20: జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమ్మె ముగిసి, సిబ్బంది విధుల్లో చేరినప్పటికీ, వార్డుల్లో చెత్త కుప్పలకు మోక్షం లభించలేదు. రహదారులపై ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దృష్టి సారించాల్సిన యంత్రాంగం పట్టించుకోకపోవడం తో దుర్గంధం మధ్య గడపాల్సి వస్తోందని వాపోతున్నా రు. కంచరపాలెం రైతుబజారులో చెత్త నిల్వలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. బజారులో చెత్తకుండీలను శానిటరీ సిబ్బంది సకాలంలో తొలగించకపోవడంతో పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా మా రింది. సంక్రాంతి నేపథ్యంలో బజారులో విక్రయాలు జోరుగా సాగాయి చెత్త, వ్యర్థాలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. దీంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మా రాయి. బజారుకు ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోందని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఎక్కడి కక్కడ చెత్త కుళ్లిపోవడం తో ఈగలు,దోమలు అధికమై ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇదే సమస్యపై సంబంధిత శానిటరీ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి చెత్తను తరలించాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

సీతమ్మధారలోనూ అదే పరిస్థితి

సీతమ్మధార: నగరంలో ప్రధాన మార్గాల్లో ఒక టైన సీతమ్మధార రాహదారి చెత్తతో పేరుకుపోయింది. సత్యం కూడలికి వెళ్లే దారి, వివేకానంద కల్యాణమండపం వద్ద రోడ్డంతా చెత్తాచెదారాలతో అస్తవ్యస్తంగా మారింది. అదేవిధంగా సీతమ్మధార రైతుబజార్ పక్క రోడ్డులో, రైతుబజార్ హాకర్స్ జోన్ పక్కన ఇదే పరిస్థితి నెలకొంది. ఆ రహదారి మీదుగా నిత్యం వేలల్లో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి నెలకొంది. పారిశుధ్య కార్మికుల సమ్మె ముగిసినా చెత్త తొలగించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది.



కంచరపాలెం రైతుబజారు ప్రధాన ద్వారం వద్ద మురుగు

31వ వార్డులోనూ..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్, సెంటర్‌పాయింట్ జంక్షన్, పోస్టాఫీస్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని చెత్తలతో తీవ్ర అసౌకర్యం నెలకొంటోంది. డంపర్‌బిన్‌లనుంచిచెత్తరోడ్డుపైకి వరకు వచ్చేస్తోంది.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

» తెలుగుదేశం పార్టీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ



బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

పూర్ణామార్కెట్, జనవరి 20: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో రూపకల్పన జరిగిందని పార్టీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ పేర్కొన్నారు. గ్రేటర్ 34వ వార్డులో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ చర్యలతో అన్నివర్గాలకు ఇబ్బందులు తప్పలేదన్నారు. సంక్షేమం కొంతమందికే పరిమితం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు పేదలు, మహిళల సంక్షేమకోసం భవిష్యత్ గ్యారెంటీ పథకం రూపొందించారన్నారు. ఈ పథకాల పట్ల రాష్ట్ర ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న రెహమాన్, సత్యనారాయణ, వాసుపల్లి రామ్‌కుమార్, రాజేశ్వరి, సరస్వతి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తే సహించేది లేదు

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి వెంకటేశ్వరి



మర్రిపాలెం ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై అంగన్‌వాడీల నిరసన

మర్రిపాలెం, జనవరి 20: సమస్యలు పరిష్కరించాలని 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను విధుల్లో చేరాలని వేధింపులకు గురి చేస్తే సహించేదిలేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి వెంకటేశ్వరి హెచ్చరించారు. విధుల్లో చేరాలని వేధింపులతోపాటు ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం రాత్రి నుంచి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన కొనసాగించారు. ఉదయం పెద్దఎత్తు చేరుకున్న సిబ్బంది మూడు బృందాలుగా ప్రధాన రహదారిలో బైఠాయించారు. విధుల్లో చేరాలని వేధింపులకు గురి చేస్తూ ఎన్ని ప్రలోభాలు పెట్టినా వెనకడుగు వేసేదిలేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు పెద్దసంఖ్యలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మోహరించారు.

'స్టీల్‌ప్లాంట్‌పై చిత్తశుద్ధి ఉంటే ఎంపీ రాజీనామా చేయాలి'

డాబాగార్డెన్స్, జనవరి 20: విశాఖపై అభిమానం, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై చిత్త శుద్ధి ఉంటే ఎంపీ పదవికి జీవీఎల్ నరసింహారావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి అన్నారు.విశాఖ ఉక్కును స్ట్రాటజిక్ సేల్‌లో భాగంగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోదీ నిర్ణయించారన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు 1073 రోజులుగా పోరాడుతున్నారన్నారు. ఎంపీ జీవీఎల్ వచ్చే ఎన్నికలలో విశాఖ నుంచి పోటీ చేయాలని తహతహలాడుతున్నారని, అయినా ఉక్కు ప్రైవేట్‌కరణ ఆపలేకపోయారన్నారు. కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే కార్పొరేట్లకు ఉక్కును అమ్మేస్తారన్నారు. జీవీఎల్ రాజానీమా చేస్తేనే కేంద్రానికి వినిపిస్తుందన్నారు. ఉక్కు కార్మిక సంఘాలు, వామపక్షాలు కలిసి వస్తే జీవీఎల్ ఇంటిని ముట్టడించి రాజీనామా చేయిద్దామని పిలుపునిచ్చారు.

'పెన్షన్ కోసం న్యాయ పోరాటం'



సమావేశంలో మాట్లాడుతున్న కట్టా ప్రసాద్

సీతంపేట, జనవరి 20: విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిల సాధనకు సమష్టి పోరాటం చేయాలని ఏపీ గ్రామీణ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కట్టా ప్రసాద్ పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన సమస్యల సాధనకు ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ((ఏఐఆర్‌ఆర్‌బీఈఏ) ద్వారా న్యాయపోరాటం చేస్తున్నామన్నారు. విశ్రాంత ఉద్యోగుల అన్ని ప్రయోజనాలు సాధించామని, భవిష్యనిధి సొమ్ము వెంటనే చెల్లించేలా చేశామన్నారు. పెన్షన్ నుంచి పీఎఫ్ పెన్షన్ వసూలు చేయడాన్ని ఆపించామన్నారు. సంఘంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రెండు వేల మది సభ్యులు ఉన్నారని వారిందరికీ ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని బకాయిలు వచ్చేలా కృషిచేస్తామన్నారు. మెడికల్ బీమా ప్రీమియంలో 50 శాతం బ్యాంకు భరించేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆళ్వార్‌దాస్‌కు ఘన నివాళి



ఆళ్వార్‌దాస్ చిత్ర పటం వద్ద వాకర్స్ నివాళి

మురళీనగర్, జనవరి 20: వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్‌దాస్ 21వ వర్ధంతిని శనివారం మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆళ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యారంగంలో ఆయన సేవల్ని గుర్తు చేసుకున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సామాజిక సేవలకు, సమష్టి తత్వానికి మారుపేరుగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య చౌదరి, క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కార్యవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



చిన్నారులతో టిఫిన్ చేస్తున్న క్రికెటర్ కమలాకర్

సీతమ్మధార, జనవరి 20: నిరాశ్రయులను, పేద విద్యార్థులను ఆదుకోవడం, వారికి సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాతీయ క్రికెటర్ జీవీఎస్ కమలాకర్ పేర్కొన్నారు. సీతమ్మధారలో గల పాపా హోమ్‌లో చిన్నారి బాలికల మధ్య శనివారం తన జన్మదిన వేడుకలను నిర్వహించారు. వారికి అల్పాహారం, భోజనం అందజేసి వారితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

కరాటేలో విజేతలకు సీఐ అభినందనలు



చిన్నారులను అభినందిస్తున్న సీఐ భాస్కర్, తదితరులు

కంచరపాలెం, జనవరి 20: సౌత్ ఏషియన్ కరాటే చాంపియన్ షిప్‌లో నగరానికి చెందిన నలుగురు చిన్నారులకు బంగారు పతకాలు లభించాయి. ఈ మేరకు శనివారం కంచరపాలెంలోని అన్ని హనహ్ హోంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ ఎస్. భాస్కరరావు చిన్నారులను అభినందించారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ వస్తుందన్నారు. చిన్నారులు మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. హోం నిర్వాహకులను అభినందించారు. హోం నిర్వాహకురాలు అనురాధ మాట్లాడుతూ ఈనెల 6,7 తేదీల్లో ఢిల్లీలో జరిగిన పోటీల్లో హోం పిల్లలు జి.లక్ష్మి, కె.పింకి, వి.గౌతమ్, ఎస్.కీర్తిమీనా బంగారు, బి.భరత్‌కుమార్, పి.ఆదిలక్ష్మి రజతం, కె.నూకరత్నం, ఎస్.ప్రవీణ్‌కుమార్, యు.మధులత కాంస్య పతకాలు సాధించారన్నారు.బంగారు పతకాలు సాధించిన చిన్నారులు నార్వేలో జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యారన్నారు. కోచ్ పడాల నాగార్జునకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఆనందరావు, కోశాధికారి శ్రీనివాస్, బి.సురేష్‌రెడ్డి, ఎస్.ప్రశాంత్ పాల్గొన్నారు.

మన ఇంటి పంటతో ఆరోగ్యం



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, జనవరి 20: మన ఇంటి పంటే ఆరోగ్యకరమని రైతునేస్తం వ్యవస్థాపకులు పద్మశ్రీ వై.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో శనివారం ప్రకృతి ఆధారిత వ్యవసాయదారుల సంఘం, రైతు నేస్తం ఆధ్వ ర్యంలో మన ఇంటి పంటతో ఆరోగ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి డాబాపై, చుట్టూతా ఉన్న ఖాళీ స్థలంలో కూరగాయలు, ఆకుకూరలు పండ్ల మొక్కలు పెంచుదామన్నారు. అనంతరం నిర్వాహకులు అతనిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, కర్రి రాంబాబు, చాట్ల సుబ్రహ్మణ్యవర్మ, చెవ్వాకుల అశోక్, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేలో ఇబ్బందులు

సీతమ్మధార, జనవరి 20: కులగణన సర్వే ప్రక్రియలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీతమ్మధార, నక్కవానిపాలెం ప్రాంతంలో సచివాలయం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఐరిస్ ద్వారా వివరాలు సేకరించారు. అయితే యాప్ ఆగితే తిరిగి ఓపెన్ కావడం లేదు. సర్వేలో ఒకరి వివరాలు నమోదుకు రెండుసార్లు బయోమెట్రిక్ వేయాల్సి వస్తోంది.



సర్వే చేస్తున్న సిబ్బంది

దుర్మార్గంగా జగన్ పాలన

... 5వ పేజీ తరువాయి

వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగిపోయాయన్నారు. కిలో బియ్యం రూ.40 నుంచి రూ.60కు, కందిపప్పు రూ.80 నుంచి రూ.160కు, చింతపండు రూ.122 నుంచి రూ.240కు పెరిగాయన్నారు. విద్యుత్ చార్జీలు ఐదు రెట్లు పెంచేశారని అన్నారు. తాము ఇంటింటికీ కేబుల్ టీవీ ప్రసారాలను రూ.149కి అందిస్తే ఇప్పుడు రూ.350కు పెంచారని ఆరోపించారు. చివరకు నాసిరకం మద్యం అమ్మకాల వల్ల 35 లక్షల మంది అనారోగ్యానికి గురికాగా, 30 వేల మంది చనిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మద్యం వ్యాపారం సీఎం చేస్తున్నారని ఆరోపించారు.

గత ఎన్నికల్లో జగన్‌ను నమ్మి ఓటేస్తే ఆయన గిరిజనుల గొంతు కోశారని చంద్రబాబునాయుడు ఆరోపించారు. అధికారంలోకి వచ్చినప్పటి ఇప్పటివరకూ గిరిజనులకు జగన్ ఒక్క మంచి పని అయినా చేశారా?...అని ప్రశ్నించారు. అదేమంటే బటన్ నొక్కుతున్నాను కదా అంటారని, గిరిజనుల కోసం ఏ బటన్ నొక్కారని నిలదీశారు. జగన్ సీఎం అయిన తరువాత గిరిజనులకు చెందిన మొత్తం 16 పథకాలు రద్దు చేశారని ఆరోపించారు. ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఉండాలని 2003లో తాము జీవో-3 తీసుకువచ్చామన్నారు. గిరిబిడ్డలకు అన్యాయం చేసేలా దానిని జగన్ రద్దు చేశారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో-3 అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. అన్ని రకాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక ప్రణాళిక రూపొందించి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. అరకు ప్రాంతంలో వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని, గిడ్డంగులు ఏర్పాటుచేసి ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంటు నెలకొల్పుతామని చెప్పారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అరకు కాఫీని ప్రమోట్ చేస్తే...వైసీపీ గంజాయ్‌ని ప్రమోట్ చేస్తోందని మండిపడ్డారు. విశాఖలో అల్లూరి సీతారామరాజు మ్యూజియం ఏర్పాటుకు నిర్ణయిస్తే దానిని మూలనపడేశారన్నారు. విశాఖలో రుషికొండకు బోడిగుండు చేసిన జగన్‌కు మరోసారి అధికారం ఇస్తే అరకు కొండలకు కూడా గుండు కొట్టిస్తారని హెచ్చరించారు. ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను తెలుగుదేశం వ్యతిరేకించిందని, వైసీపీ వచ్చిన తరువాత లేటరైట్ ముసుగులో బాక్సైట్ తవ్వుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఏజెన్సీలో లేటరైట్‌ను తవ్వి సీఎం సతీమణి భారతిరెడ్డికి చెందిన భారతి సిమెంట్ కంపెనీకి తరలిస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల సంపద దోచుకుంటున్న జగన్ ఈ ప్రాంతానికి ఒక్క రోడ్డు కూడా వేయలేదని వ్యాఖ్యానించారు. చివరకు వైద్యం కోసం ఫీడర్ అంబులెన్స్‌లు పోయి డోలీ మోతలపై ఆధారపడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు.

జగన్ మోసాలకు బలికావొద్దు

కులం, మతం పేరుతో జగన్ చేస్తున్న మోసాలకు ఎవరు బలికావద్దన్నారు. మతం, కులం, ప్రాంతం తిండిపెట్టవని, సుపరిపాలన, అభివృద్ధి ఫలాలు అందిస్తే ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. తాను పెత్తందారునని జగన్ విమర్శిస్తుంటారని, అయితే దేశంలోనే అత్యంత ధనవంతుడైన సీఎంగా ఆయనకు రికార్డు ఉందన్నారు. పేదల పక్షపాతిగా చెప్పుకుంటున్న జగన్ వేల కోట్ల ఆస్తులు సంపాదనకు ఏ మంత్రం జపిస్తున్నారో...దానిని చెబితే గిరిజనులు ధనవంతులవుతారని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కొత్త వేషంతో జగన్ వస్తారని పేర్కొంటూ ప్రజలంతా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

వాసుపల్లికి కార్పొరేటర్ల షాక్

... 5వ పేజీ తరువాయి

ఈ నెల 25న భీమిలిలో జరగనున్న ముఖ్యమంత్రి సభకు జన సమీకరణపై మాట్లాడేందుకు శనివారం వాసుపల్లి ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి 36వ వార్డు కార్పొరేటర్ పద్మావతి తప్ప మిగిలిన కార్పొరేటర్లు ఎవరూ హాజరుకాలేదు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో ఇండిపెండెంట్లుగా గెలిచి వైసీపీలో చేరిన ముగ్గురు కార్పొరేటర్లలో ఇద్దరు (కందుల నాగరాజు, సాదిక్) ఇప్పటికే పార్టీకి గుడ్‌బై చెప్పి, జనసేనలో చేరిపోయారు. ఇక టీడీపీ తరఫున గెలిచి ఆ తరువాత వైసీపీ పంచన చేరిన కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ కూడా ఈ సమావేశానికి రాలేదు. మరో కార్పొరేటర్ కోడూరు వెంకటరత్నం ఉరఫ్ కొండమ్మ కూడా గైర్హాజరయ్యారు. నియోజకవర్గంలో వైసీపీకి ఎనిమిది మంది ఉండగా ఒక్కరే రావడంతో కార్యకర్తల కూడా సంఖ్య కూడా తగ్గిపోయింది. ఆ వచ్చిన వారినే కూర్చోబెట్టి మాట్లాడారు.

పుంజుకున్న పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరిపోతున్నారు. గతంలో చింతపల్లి మండలం లంబసింగిలో మాత్రమే మేఘాల లోకం ఆవిష్కృతమయ్యేది. ఆ తరువాత పాడేరు సమీపాన వంజంగి, అరకులోయ వద్ద మాడగడ కూడా సందర్శనీయ ప్రాంతాలుగా మారాయి. మరిన్ని ప్రాంతాలు అందుబాటులోకి రావడంతో సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది.

వంజంగికి వారం రోజుల విరామం

శీతాకాలంలో అక్టోబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఏజెన్సీకి సందర్శకులు పెద్ద సంఖ్యలో రావడం ఆనవాయితీ. ఈసారి డిసెంబరులో ఎక్కువ మంది రావడంతో సందర్శనీయ ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. రోజూ వేల సంఖ్యలు పర్యాటకులు రావడం, అందుకు తగ్గట్టుగా పారిశుధ్య పనులు అక్కడ చేపట్టలేకపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వంజంగిలో సందర్శకులకు వారం రోజులు అనుమతించబోమని ఐటీడీఏ ప్రకటించింది. జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు ఎవరినీ అక్కడికి రానీయకుండా పారిశుధ్య పనులు చేపట్టింది. సుమారుగా ఎనిమిది లారీల ప్లాస్టిక్ వ్యర్థాలు, పార్శిల్ పొట్లాలు, ఇతరాలు వచ్చాయి.

విశాఖలో నేవీ మ్యూజియాలకు రద్దీ

విశాఖపట్నంలో కైలాసగిరితో పాటు ఆర్కే బీచ్‌లో నేవీ ఏర్పాటు చేసిన కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ-142, సీ హ్యారియర్ యుద్ధ విమాన మ్యూజియాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిని చూడడానికి పర్యాటకులు రెండు నుంచి మూడు కిలోమీటర్ల పొడవున క్యూలు కట్టి నిల్చొన్నారంటే అర్థం చేసుకోవచ్చు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు బెంగాలీలు ఎక్కువగా విశాఖ వస్తుంటారు. వారితో పాటు ఒడిశా, తెలంగాణా వారు కూడా జత కలిశారు.

ఉత్సవ్‌లు లేకున్నా...ఆదరణ

పర్యాటకులను ఆకర్షించడానికి విశాఖ ఉత్సవ్, అరకు ఉత్సవ్, భీమిలి ఉత్సవ్‌లతో పాటు వీఎంఆర్‌డీఏ ఫ్లవర్ షోలను జిల్లా యంత్రాంగం నిర్వహించేది. డిసెంబరులో జరిగే ఈ ఉత్సవ్‌లతోనే పండుగ వాతావరణం వచ్చేది. కరోనా తరువాత రాష్ట్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం మానేసింది. జిల్లా యంత్రాంగం కూడా ఖర్చుకు భయపడి, నిధులు లేక వెనకడుగు వేసింది. అయినా సరే పర్యాటకులు అధిక సంఖ్యలో రావడం గమనార్హం.

మందకొడిగా కులగణన

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి, వలంటీర్ వేలిముద్రలు వేయాలి. ఆ సమయంలో సర్వర్ మొరాయిస్తోంది. కొన్నిచోట్ల సిగ్నల్స్ లేక రోడ్లపైకి, ఇంటి మేడపైకి వెళ్లి వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇదిలావుండగా నగరంలో పలుచోట్ల సర్వే సిబ్బంది, వలంటీర్ వీధిలో ఒకచోట కూర్చుని అందరినీ అక్కడకు పిలిపించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఫలానా చోటకు సిబ్బంది వస్తున్నందున కులగణన కోసం అందరూ అక్కడకు రావాలని వలంటీర్లు తమ పరిధిలోని వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్ పెడుతున్నారు. శనివారం సాయంత్రం వరకు 86,003 (12.024 శాతం) ఇళ్లకు సంబంధించి 1,97,583 మందిని (9.21 శాతం) సర్వే చేసి వివరాలు అప్‌లోడ్ చేశారు.

అల్లూరి సత్యనారాయణరాజు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, తదితరులు

సీతంపేట, జనవరి 20: అభ్యుదయ రచయిత సఘం ఆధ్వర్యంలో చారిత్రక నవలా రచయిత ఎన్‌డీవీ అజీజ్ రచించిన అల్లూరి సత్యనారాయణరాజు పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ శనివారం ఆవిష్కరించారు. పౌరగ్రంథాలయంలో అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగి కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ అజీజ్ సాహిత్య సేవకుడని, అల్లూరి జీవిత విశేషాలతో పాటు నాటి సామాజిక పరిస్థితులను స్వాతంత్ర్య ఉద్యమ నాటి సంఘటనలతో రచించడం శుభపరిణామం అన్నారు. న్యాయవాది అల్లూరి సీతారామారాజు, వెంకటపతిరాజు, రచయిత అజీజ్, బి.రాధారాణి, కేజీ వేణు, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, శ్యామసుందర్ రాజు, బొట్ట అప్పారావు, పోతన తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఫిడే రేటెడ్ ఓపెన్ చెస్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 20: చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి ఫిడే రేటెడ్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ జరగనుంది. ఎంవీపీ కాలనీలోని ఎస్3 స్పోర్ట్సు ఎరీనాలో జరిగే టోర్నీలో అన్ని వయసుల వారు పాల్గొనవచ్చునని టోర్నీ డైరెక్టర్ బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు రూ.4 లక్షల బహుమతులు అందించనున్నామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 23వ తేదీలోగా 9989971232, 98493717140 నంబర్లలో సంప్రదించాలన్నారు.



శ్రీదేవి, భూదేవి సమేతంగా పూజలందుకున్న శ్రీవారు

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 20: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామున వేదపండితులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకించాక ఊరేగింపుగా తీసుకువచ్చిన ప్రత్యేక పుష్పాలు,ఆభరణాలతో శ్రీవారిని అలంకరించారు. అనంతరం స్వామికి తోమాలసేవ చేసి పూజలు జరిపారు. సాయంత్రం పువ్వులతో అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి సహస్ర నామార్చన, నక్షత్ర హారతి పూజలు చేసి శాంతికల్యాణాన్ని నిర్వహించారు. పూజల్లో పాలకమండలి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెందుర్తి వెంకటాద్రిపై..

పెందుర్తి: పెందుర్తి వెంకటాద్రిపై గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారికి అర్చకులు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.సుప్రభాత సేవ, తోమాల సేవ చేశారు.అనంతరం సహస్ర నామార్చన,అష్టోత్తరం,దూప సేవ,దీపోత్సవం నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఉచిత ప్రసాద వితరణ చేశారు.

వాంబే కాలనీలో సుదర్శన హోమం

పెదగంట్యాడ: ఇక్కడి వాంబే కాలనీలోని స్వయంభూ వేంకటేశ్వరాలయంలో శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. స్వామివారి సుప్రబాత సేవ అనంతరం హోమం జరిపారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, చైర్మన్, సింహాచలం దేవస్థానం ట్రస్టీ దొడ్డి రమణ ఈ కార్యక్రమాలకు సారథ్యం వహించారు. కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, మహమ్మద్ ఇమ్రాన్, వైసీపీ 'గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు, మాజీ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.

'టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

మల్కాపురం, జనవరి 20: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలుపించుకుంటేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పాండ్రంగి జయరాజు పేర్కొన్నారు. స్థానిక మాజీ సైనికుల కాలనీలో శనివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అన్నివిధాల నష్టపోతుందని, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవర అప్పలరాజు, కాకర్ల రమణ, కసిరెడ్డి రాము, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కొత్త కార్డులు పంపిణీ

పెందుర్తి, జనవరి 20: రైతుబజార్ల పర్యవేక్షణాధికారి షేక్ యాసిన్ శనివారం పెందుర్తి రైతుబజారును సందర్శించారు. రైతుబజారు నిర్వహణ, వినియోగదారులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం రైతు బజారులోని రైతులకు కొత్తగా మంజూరైన కార్డులను పంపిణీ చేశారు. ఈ రైతు బజారులో మొత్తం 153 మంది రైతులకు గతంలో కార్డులు మంజూరు చేశామని, వీరిలో 23 మంది అనర్హులను తొలగించి మిగతా వారికి తాజాగా కార్డులను అందించామన్నారు. ఎస్టేట్ అధికారి షర్మిల, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ

అక్కిరెడ్డిపాలెం, జనవరి 20: అంగన్‌వాడీలకు మద్దతుగా బెల్ హెచ్‌పీవీపీ మెయిన్‌గేటు వద్ద శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు విరాళాలు సేకరించారు. నలభై రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని యూనియన్ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాష్ అన్నారు. కార్మికుల నుంచి సేకరిస్తున్న విరాళాలను వారి ఉద్యమం కోసం అందిస్తామన్నారు. నాయకులు జగన్నాథరావు, నారపరెడ్డి, అచ్చెన్నాయుడు,శివరాం తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారెట్ 36, దొండకాయలు 26, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 48 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30 , కంద 58, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



విద్యుత్ దీపాలు వెలగక చీకటిమయంగా ఉన్న తోకాడ రహదారి



అంధకారంలో కణితి కాలనీలోని ఓ వీధి

గాజువాకలో రాజ్యమేలుతున్న చీకటి

జోన్ పరిధిలోని వీధులు, ప్రధాన రహదారుల్లో వెలగని వీధి లైట్లు

రెండు, మూడేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు



చీకటిమయమైన గాజువాకలోని రాజీవ్ మార్గ్..

గాజువాక, జనవరి 20:
జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో వీధి లైట్లు సరిగ్గా వెలకగపోవడంతో రాత్రయ్యేసరికి పలు ప్రధాన రహదారులు, కాలనీల్లో చీకటి రాజ్యమేలుతోంది. వీధి లైట్లను పునరుద్ధరించాలంటూ కార్పొరేటర్లకు, అధికారులకు పలుమార్లు విన్నవించుకుంటున్నా ఫలితం లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సోమవారం జోన్ గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అధిక శాతం వినతులు వీధి లైట్ల కోసమే అధికారులకు అందుతున్నాయి. వీధిలైట్ల నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్ పర్యవేక్షణలో జరుగుతుండేది. అయితే రెండేళ్లుగా టెండర్ పిలవకపోవడంతో విద్యుత్తుపరమైన సమస్యలను పరిష్కరించుకోలేని దుస్థితి నెలకొనడంతో ఆరు నెలల క్రితం ఓ కాంట్రాక్టర్‌కు బాధ్యతలను అప్పగించారు. అయినప్పటికీ వీధి లైట్ల సమస్య యథావిధిగానే కొనసాగుతోంది. కొత్త లైట్లు రెండు, మూడు వందల చొప్పున వచ్చినప్పటికీ ప్రతి వార్డుకు పదికి మించి ఇవ్వలేని పరిస్థితి నెలకొనడంతో కార్పొరేటర్లు వీధి లైట్ల కోసం అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. అయినప్పటికీ వార్డుల్లో పూర్తి స్థాయిలో వీధి లైట్లను పునరుద్ధరించలేకపోతున్నామని కార్పొరేటర్లు నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

కాగా అన్ని వార్డుల్లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాత్రయ్యేసరికి రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నామని పాదచారుల, ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ప్రధానంగా రాజీవ్ మార్గ్, కణితి రోడ్డు, కాకతీయ జంక్షన్ నుంచి బీసీ రోడ్డులో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయి ఇటువంటి కీలక రహదారుల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అలాగే శివారు ప్రాంతాల్లోని కాలనీల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ గడపాల్సివస్తోంది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వార్డుల్లో, ప్రధాన రహదారుల్లో వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చీకటిమయంగా ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు

పెదగంట్యాడ: పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రధాన రహదారి రాత్రయ్యేసరికి చీకటిమయంగా మారుతున్నది. ఈ మార్గంలో సుమారు కిలోమీటరు పొడవునా విద్యుత్ స్తంభాలు.. వాటికి లైట్లు ఉన్నప్పటికీ రెండు, మూడు మాత్రమే వెలుగుతున్నాయి. దీంతో ఈ మార్గంలో రాత్రయ్యేసరికి చీకటి అలుముకుంటుందని, దీంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఐలా కానీ జీవీఎంసీ అధికారులు గానీ పట్టించుకోకపోవడం వల్లే ఈ రోడ్డులో లైటింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ జంక్షన్ నుంచి ఇండిస్ట్రియల్ ఎస్టేట్ మీదుగా యాతపాలెం కూడలి వరకు ఈ రోడ్డు ఉంది. యాతపాలెం, వెంకన్నపాలెం, కొత్తదిబ్బపాలెం, అశోక్‌నగర్ కాలనీల వాసులు పెదగంట్యాడ, గాజువాక రాకపోకలు సాగించేందుకు ఈ రహదారినే వినియోగిస్తారు. అయితే రాత్రిపూట ఈ రోడ్డు చీకటిమయంగా మారడం, రహదారికి ఇరువైపులా భారీ వాహనాలు పార్కింగ్ చేసి ఉంటుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు చెబుతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గాడాంధకారంలో కణితి, వడ్లపూడి కాలనీలు

కూర్మన్నపాలెం: ఇక్కడి కణితి, వడ్లపూడి కాలనీల్లో గాడాంధకారం అలుముకుంది. ఎప్పుడు వెలుగుతాయో.. ఎప్పుడు ఆరిపోతాయో తెలియని ఎల్‌ఈడీ బల్బుల పనితీరుతో ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. నాణ్యత లేని ఎల్‌ఈడీ బల్బుల వినియోగం వల్ల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు గురైన విద్యుత్ దీపాల స్థానంలో కొత్తవి అమర్చకపోవడంతో గాజువాక నియోజకవర్గ పరిధిలో పలు కాలనీలు రాత్రయ్యేసరికి చీకట్లో మగ్గుతున్నాయి. దీంతో అర్ధరాత్రి విధులు ముగించుకుని ఇళ్లకు చేరుకునే కార్మికులు కుక్కల బారిన పడుతున్నారు.

అలాగే ఈ ప్రాంతంలో విష సర్పాలు అధికంగా సంచరిస్తున్నందున రాత్రి పూట బయటకు వచ్చేందుకు స్థానికులు భీతిల్లుతున్నారు. రాత్రి వేళల్లో చిల్లర దొంగతనాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

71వ వార్డులో..

ఆదేవిధంగా 71వ వార్డు పరిధి ఆటోనగర్, చట్టివానిపాలెం, తోకాడలోని పలు కాలనీల్లో అంధకారం రాజ్యమేలుతోంది. చీకటి పడేతి చాలు ఆయా కాలనీల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయపడిపోతున్నారు. ఒకపక్క చీకటి, మరోపక్క పెద్ద పెద్ద గోతులు ఉండడంతో ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా వాహనాల పైనుంచి పడిపోయే దుస్థితి ఉందని పలువురు ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. వీటికి తోడు కుక్కలు వెంబడిస్తుండడంతో చీకట్లో వాహనాలపై స్పీడుగా వెళ్లి కిందపడి గాయపడే సంఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. పలుమార్లు పారిశ్రామికవేత్తలు ఏపీఐఐసీ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలంటూ అఖిలపక్షాల ర్యాలీ



గాజువాకలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు, కార్మికులు

గాజువాక, జనవరి 20: నిరవధిక సమ్మె బాట పట్టిన అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం గాజువాకలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 40 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో కనీస చలనం లేకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించటం దుర్మార్గమన్నారు. అన్నివిధాల సేవలందిస్తున్న వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ ర్యాలీ పాత గాజువాక నుంచి సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్త గాజువాక వరకు వెళ్లి, తిరిగి అదే మార్గంలో పాత గాజువాకకు చేరుకున్నది. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బి.వెంకటరావు, జె.రామకృష్ణ, యేల్లేటి శ్రీనివాసరావు, తాంత్ర కనకరాజు, జి.ఆనంద్, కృష్ణమూర్తి, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా..

వైసీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



శ్రీహరిపురంలో కేక్ కట్ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, జనవరి 20: రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైసీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఆయన జన్మదిన వేడుకలను కార్పొరేటర్లు, నాయకులు శనివారం సాయంత్రం శ్రీహరిపురం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పీవీ సురేశ్, గులిగిందల లావణ్య, కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు,గుండపు నాగేశ్వరరావు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదండి బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డీ జంక్షన్: గ్రేటర్ 52వ వార్డులో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఆయనను డిప్యూటీ మేయర్ శ్రీధర్ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 90వ వార్డు బాజీ జంక్షన్‌లో ఆనంద్‌కుమార్ కేక్ కట్ చేశారు. నమ్మి శ్రీను, ఆల్ల్వా కృష్ణ, అప్పలరెడ్డి, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: స్థానిక కుమారి కల్యాణ మండపంలో జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఆడారి ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయనను గజమాలతో సత్కరించారు. అలాగే కొత్తపాలెంలో వైసీపీ 89వ వార్డు అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలను చేపట్టారు.

వాంబే కాలనీలో పూడికల తొలగింపు

పెదగంట్యాడ, జనవరి 20: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీలోని డ్రైనేజీల్లో పెద్దఎత్తున పేరుకుపోయిన పూడికలను తొలగించే పనులను జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది శనివారం చేపట్టారు. డ్రైనేజీలలో పూడికలు నిండుగా చేరిపోవడం, మురుగు నీరు దిగువకు ప్రవహించేందుకు వీల్లేకపోవడంతో నెల రోజులుగా ఆయా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడ్డారు. దుర్వాసనకు తోడు దోమలు విజృంభించడంతో ప్రజలు నానాపాట్లు పడ్డారు. ఎట్టకేలకు ఈ సమస్యలను గుర్తించిన జీవీఎంసీ అధికారులు పూడిక తొలగింపు పనులు చేపట్టారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తూ పనులు చేయిస్తున్నారు. రెండు రోజుల్లో పూడిక తొలగింపు పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

హెచ్‌పీసీఎల్‌పై జీవీఎంసీ జట్టు విజయం

గాజువాక, జనవరి 20: గాజువాక జింక్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో హెచ్‌పీసీఎల్ జట్టుపై జీవీఎంసీ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జీవీఎంసీ జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హెచ్‌పీసీఎల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 126 పరుగులు మాత్రమే చేసి పరాజయం పాలైంది. గెలుపొందిన జీవీఎంసీ జట్టును అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

వైభవంగా శ్రీరాముని రథయాత్ర

పెందుర్తి-రూరల్, జనవరి 20: అయోధ్యలో ఈ నెల 22న రామ మందిరం ప్రారంభం, విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో మండలంలోని లక్ష్మీపురం, గవరపాలెం కాలనీ, చింతలఅగ్రహారం గ్రామాల్లో శనివారం భక్తులు, పెద్దలు శ్రీరాముని రథయాత్ర నిర్వహించారు. ముందుగా లక్ష్మీపురం పోర్టు కాలనీలోగల శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద రథానికి పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, కోలాటాలు, భక్తుల జై శ్రీరాం అంటూ చేసిన నినాదాల నడుమ రథయాత్ర ముందుకు సాగింది. లక్ష్మీపురం కూడలి, సాయినగర్ సంపత్ వినాయకస్వామి ఆలయం మీదుగా గవరపాలెం కాలనీలోని గీతాకృష్ణ మందిరం వరకు రథయాత్ర సాగింది. ఇక్కడి మందిరంలో ప్రత్యేక పూజలు చేశాక మళ్లీ రథయాత్ర చింతలఅగ్రహారం రామాలయానికి చేరింది. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

గాజువాకలో రామ మందిర ప్రారంభంపై ప్రచారం

గాజువాక: అయోధ్యలో సోమవారం జరగనున్న రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం గాజువాకలో ప్రచారాన్ని వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రామ మందిరం ప్రారంభం సందర్భంగా ప్రజలకు అక్షితలు పంపిణీ చేస్తున్నామన్నారు. గాజువాకలో 22వ తేదీ ఉదయం ఆరు నుంచి 23వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

నేడు జనసేన బైక్ ర్యాలీ

పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు

శ్రీనగర్, జనవరి 20: 'జనం వద్దకు జనసేన' అంటూ ఆదివారం పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించే బైక్ ర్యాలీలో గాజువాక నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు కోరారు. శ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బైక్ ర్యాలీ 86,87,88,85,79 వార్డుల్లో కొనసాగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమన్నారు. వైసీపీ పాలన నుంచి ఏపీకి విముక్తి కల్పించడమే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు కరణం కనకారావు, సోమశేఖర్,శ్రీను,కనకరాజు,మురళీదేవి, చినఅప్పారావు,తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ వాసి ఖరగ్‌పూర్‌లో మృతి



మృతుడు స్వరూప్ (ఫైల్)

వేపగుంట, జనవరి 20: ఇక్కడి నాయుడుతోట కృష్ణానగర్‌కు చెందిన ఎర్రా స్వస్త్ స్వరూప్ (30) అనే వ్యక్తి ఖరగ్‌పూర్‌లో మృతిచెందాడు. ఖరగ్‌పూర్ రైల్వే ట్రాక్‌పై స్వరూప్ మృతి చెంది ఉండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాయుడుతోటకు చెందిన జనసేన పార్టీ నాయకుడు ఎర్రా నాగరాజు కుమారుడు స్వస్త్ స్వరూప్. సీఏ పూర్తి చేసిన స్వరూప్ సౌత్ ఈస్ట్రన్ రైల్వేలో ఆడిటింగ్ విభాగంలో అధికారిగా పనిచేస్తున్నారు. శుక్రవారం విధుల నిమిత్తం హౌరాలో విధులకు వెళ్లిన ఆయన మధ్యాహ్నం నుంచి ఫోనుకు అందుబాటులో లేడు. అయితే శుక్రవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులకు అక్కడి అధికారులు ఫోన్ చేసి స్వరూప్ మృతి చెందినట్టు సమాచారం అందించారు. దీంతో వారు విలపిస్తూ ఖరగ్‌పూర్‌కు వెళ్లారు. స్వరూప్ మృతదేహానికి ఆదివారం కృష్ణానగర్ శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

రూ.కోటితో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఆటోనగర్, జనవరి 20: ఆటోనగర్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిని రూ.కోటీ నాలుగు లక్షలతో నిర్మించేందుకు ఐలా కమిషనర్ కె.జయచంద్ర శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతులకు గురైన డ్రెయిన్లు, రోడ్ల వెడల్పు, తదితర అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఐలా సెక్రటరీ చీకటి సత్యనారాయణ మాట్లాడుతూ ఆటోనగర్‌లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఐలా ఉపాధ్యక్షులు కొల్లి ఈశ్వరరావు, శేఖర్ బాబు, జి.రాము, సిబ్బంది నాయుడు,రామకృష్ణంరాజు,తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్ ప్రగతిలో ప్రతి ఒక్కరిది కీలక పాత్ర

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 20: స్టీల్‌ప్లాంట్ ప్రగతిలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని జీఎం (హెచ్‌ఆర్) కె.సంజీవరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ సెల్ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో స్టీల్‌ప్లాంట్ మరింత ఉత్పత్తి సాధించే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అంబేడ్కర్ ఆశయ సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంఘాలు కార్మిక సంక్షేమంకు కృషి చేస్తున్నాయని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తౌడన్న, నాయకులు సత్యనారాయణ, ఎల్.రమణ, రత్నం, గణేశ్, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

పురోగతి లేని ఎన్‌జేసీఎస్ చర్చలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 20: ఉక్కు ఉద్యోగులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న ఎన్‌జేసీఎస్ సమావేశం నిరాశపరిచింది. ఉక్కు ఉద్యోగులకు ఈ ఎన్‌జేసీఎస్ సమావేశంలో నూతన వేతనాలపై చర్చ జరిగి అమలు జరుగుతుందని నిరీక్షించారు. అయితే శనివారం నాటి సమావేశంలో ఎటువంటి చర్చ జరగలేదని, కార్మికులకు ఆమోదయోగ్యమైన ఎటువంటి హామీ లభించలేదని సమావేశానికి హాజరైన ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు తెలిపారు. ఈ సమావేశంలో కార్మికకుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని, అందువల్ల ఈ నెల 29, 30 తేదీల్లో తలపెట్టిన ఉక్కు సమ్మెను యథావిధిగా కొనసాస్తామని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరాం పేర్కొన్నారు.

ఘనంగా సీతారాముల పరస

అగనంపూడి, జనవరి 20: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అండమాన్ కొండయ్యవలసలోని రామాలయం వద్ద శనివారం సీతారాముల పరసను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు సీతారాముల వారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో బాలగణపతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరసను చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెటగుళ్లు, సాముగారిడీలు, బొమ్మలకొలువు, తదితరమైనవి చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. స్టీల్‌పాంట్‌లో ఉద్యోగ విరమణ చేసిన పట్టా రామకృష్ణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు విందుల వెంకటరమణ పి.వసంతరావు, బి.శ్రీను, బి.అప్పారావు, అచ్యుత్, పిళ్లా కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

95వ వార్డులో రోళ్ల పైడిమాంబ..

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లి, పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత రోళ్ల పైడిమాంబ పరసను శనివారం సాయంత్రం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎర్నిబాబు ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

నేడు మర్రిపాలెంలో రామలీల పరస

మర్రిపాలెం, జనవరి 20: రామలీల పరస మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పరస సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.



డాబాగార్డెన్స్ పోస్టాఫీస్ వీధిలో రహదారిపైనే చెత్త కుప్పలు



సీతమ్మధార పరిధి నక్కవానిపాలెం వద్ద పేరుకుపోయిన చెత్త

సమ్మె ముగిసినా చెత్త తొలగించరా?

- వార్డుల్లో పలుచోట్ల పేరుకుపోయిన వైనం
- దృష్టి సారించని యంత్రాంగం

కంచరపాలెం, జనవరి 20: జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమ్మె ముగిసి, సిబ్బంది విధుల్లో చేరినప్పటికీ, వార్డుల్లో చెత్త కుప్పలకు మోక్షం లభించలేదు. రహదారులపై ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దృష్టి సారించాల్సిన యంత్రాంగం పట్టించుకోకపోవడం తో దుర్గంధం మధ్య గడపాల్సి వస్తోందని వాపోతున్నారు. కంచరపాలెం రైతుబజారులో చెత్త నిల్వలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. బజారులో చెత్తకుండీలను శానిటరీ సిబ్బంది సకాలంలో తొలగించకపోవడంతో పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా మారింది. సంక్రాంతి నేపథ్యంలో బజారులో విక్రయాలు జోరుగా సాగాయి. చెత్త, వ్యర్థాలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. దీంతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. బజారుకు ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తోందని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఎక్కడి కక్కడ చెత్త కుళ్లిపోవడంతో ఈగలు,దోమలు అధికమై ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇదే సమస్యపై సంబంధిత శానిటరీ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి చెత్తను తరలించాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

సీతమ్మధారలోనూ అదే పరిస్థితి

సీతమ్మధార: నగరంలో ప్రధాన మార్గాల్లో ఒక టైన సీతమ్మధార రాహదారి చెత్తతో పేరుకుపోయింది. సత్యం కూడలికి వెళ్లే దారి, వివేకానంద కల్యాణమండపం వద్ద రోడ్డంతా చెత్తాచెదారాలతో అస్తవ్యస్తంగా మారింది. అదేవిధంగా సీతమ్మధార రైతుబజార్ పక్క రోడ్డులో, రైతుబజార్ హాకర్స్ జోన్ పక్కన ఇదే పరిస్థితి నెలకొంది. ఆ రహదారి మీదుగా నిత్యం వేలల్లో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి నెలకొంది. పారిశుధ్య కార్మికుల సమ్మె ముగిసినా చెత్త తొలగించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది.



కంచరపాలెం రైతుబజారు ప్రధాన ద్వారం వద్ద మురుగు

31వ వార్డులోనూ..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ సెంటర్‌పాయింట్ జంక్షన్, పోస్టాఫీస్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని చెత్తలతో తీవ్ర అసౌకర్యం నెలకొంటోంది. డంపర్‌బిన్‌లనుంచిచెత్తరోడ్డుపైకి వరకు వచ్చేస్తోంది.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

- తెలుగుదేశం పార్టీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ



బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

పూర్ణామార్కెట్, జనవరి 20: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో రూపకల్పన జరిగిందని పార్టీ దక్షిణ ఇన్‌చార్జి గండి బాబ్జీ పేర్కొన్నారు. గ్రేటర్ 34వ వార్డులో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ చర్యలతో అన్నివర్గాలకు ఇబ్బందులు తప్పలేదన్నారు. సంక్షేమం కొంతమందికే పరిమితం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు పేదలు, మహిళల సంక్షేమకోసం భవిష్యత్ గ్యారెంటీ పథకం రూపొందించారన్నారు. ఈ పథకాల పట్ల రాష్ట్ర ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న రెహమాన్, సత్యనారాయణ, వాసుపల్లి రామ్‌కుమార్, రాజేశ్వరి, సరస్వతి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తే సహించేది లేదు

- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి వెంకటేశ్వరి



మర్రిపాలెం ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై అంగన్‌వాడీల నిరసన

మర్రిపాలెం, జనవరి 20: సమస్యలు పరిష్కరించాలని 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను విధుల్లో చేరాలని వేధింపులకు గురి చేస్తే సహించేదిలేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి వెంకటేశ్వరి హెచ్చరించారు. విధుల్లో చేరాలని వేధింపులతోపాటు ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం రాత్రి నుంచి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన కొనసాగించారు. ఉదయం పెద్దఎత్తు చేరుకున్న సిబ్బంది మూడు బృందాలుగా ప్రధాన రహదారిలో బైఠాయించారు. విధుల్లో చేరాలని వేధింపులకు గురి చేస్తూ ఎన్ని ప్రలోభాలు పెట్టినా వెనకడుగు వేసేదిలేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు పెద్దసంఖ్యలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మోహరించారు.

'స్టీల్‌ప్లాంట్‌పై చిత్తశుద్ధి ఉంటే ఎంపీ రాజీనామా చేయాలి'

డాబాగార్డెన్స్, జనవరి 20: విశాఖపై అభిమానం, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై చిత్త శుద్ధి ఉంటే ఎంపీ పదవికి జీవీఎల్ నరసింహారావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక దండి అన్నారు.విశాఖ ఉక్కును స్ట్రాటజిక్ సేల్‌లో భాగంగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోదీ నిర్ణయించారన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు 1073 రోజులుగా పోరాడుతున్నారన్నారు. ఎంపీ జీవీఎల్ వచ్చే ఎన్నికలలో విశాఖ నుంచి పోటీ చేయాలని తహతహలాడుతున్నారని, అయినా ఉక్కు ప్రైవేట్‌కరణ ఆపలేకపోయారన్నారు. కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే కార్పొరేట్లకు ఉక్కును అమ్మేస్తారన్నారు. జీవీఎల్ రాజానీమా చేస్తేనే కేంద్రానికి వినిపిస్తుందన్నారు. ఉక్కు కార్మిక సంఘాలు, వామపక్షాలు కలిసి వస్తే జీవీఎల్ ఇంటిని ముట్టడించి రాజీనామా చేయిద్దామని పిలుపునిచ్చారు.

'పెన్షన్ కోసం న్యాయ పోరాటం'



సమావేశంలో మాట్లాడుతున్న కట్టా ప్రసాద్

సీతంపేట, జనవరి 20: విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిల సాధనకు సమష్టి పోరాటం చేయాలని ఏపీ గ్రామీణ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కట్టా ప్రసాద్ పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన సమస్యల సాధనకు ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ((ఏఐఆర్‌ఆర్‌బీఈఏ) ద్వారా న్యాయపోరాటం చేస్తున్నామన్నారు. విశ్రాంత ఉద్యోగుల అన్ని ప్రయోజనాలు సాధించామని, భవిష్యనిధి సొమ్ము వెంటనే చెల్లించేలా చేశామన్నారు. పెన్షన్ నుంచి పీఎఫ్ పెన్షన్ వసూలు చేయడాన్ని ఆపించామన్నారు. సంఘంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రెండు వేల మది సభ్యులు ఉన్నారని వారిందరికీ ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని బకాయిలు వచ్చేలా కృషిచేస్తామన్నారు. మెడికల్ బీమా ప్రీమియంలో 50 శాతం బ్యాంకు భరించేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆళ్వార్‌దాస్‌కు ఘన నివాళి



ఆళ్వార్‌దాస్ చిత్ర పటం వద్ద వాకర్స్ నివాళి

మురళీనగర్, జనవరి 20: వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్‌దాస్ 21వ వర్ధంతిని శనివారం మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆళ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యారంగంలో ఆయన సేవల్ని గుర్తు చేసుకున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సామాజిక సేవలకు, సమష్టి తత్వానికి మారుపేరుగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య చౌదరి, క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కార్యవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



చిన్నారులతో టిఫిన్ చేస్తున్న క్రికెటర్ కమలాకర్

సీతమ్మధార, జనవరి 20: నిరాశ్రయులను, పేద విద్యార్థులను ఆదుకోవడం, వారికి సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాతీయ క్రికెటర్ జీవీఎస్ కమలాకర్ పేర్కొన్నారు. సీతమ్మధారలో గల పాపా హోమ్‌లో చిన్నారి బాలికల మధ్య శనివారం తన జన్మదిన వేడుకలను నిర్వహించారు. వారికి అల్పాహారం, భోజనం అందజేసి వారితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

మన ఇంటి పంటతో ఆరోగ్యం



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, జనవరి 20: మన ఇంటి పంటే ఆరోగ్యకరమని రైతునేస్తం వ్యవస్థాపకులు పద్మశ్రీ వై.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో శనివారం ప్రకృతి ఆధారిత వ్యవసాయదారుల సంఘం, రైతు నేస్తం ఆధ్వ ర్యంలో మన ఇంటి పంటతో ఆరోగ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి డాబాపై, చుట్టూతా ఉన్న ఖాళీ స్థలంలో కూరగాయలు, ఆకుకూరలు పండ్ల మొక్కలు పెంచుదామన్నారు. అనంతరం నిర్వాహకులు అతనిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, కర్రి రాంబాబు, చాట్ల సుబ్రహ్మణ్యవర్మ, చెవ్వాకుల అశోక్, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విజేతలకు సీఐ అభినందనలు



చిన్నారులను అభినందిస్తున్న సీఐ భాస్కర్, తదితరులు

కంచరపాలెం, జనవరి 20: సౌత్ ఏషియన్ కరాటే చాంపియన్ షిప్‌లో నగరానికి చెందిన నలుగురు చిన్నారులకు బంగారు పతకాలు లభించాయి. ఈ మేరకు శనివారం కంచరపాలెంలోని అన్ని హనహ్ హోంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ ఎస్. భాస్కరరావు చిన్నారులను అభినందించారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ వస్తుందన్నారు. చిన్నారులు మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. హోం నిర్వాహకులను అభినందించారు. హోం నిర్వాహకురాలు అనురాధ మాట్లాడుతూ ఈనెల 6,7 తేదీల్లో ఢిల్లీలో జరిగిన పోటీల్లో హోం పిల్లలు జి.లక్ష్మి, కె.పింకి, వి.గౌతమ్, ఎస్.కీర్తిమీనా బంగారు, బి.భరత్‌కుమార్, పి.ఆదిలక్ష్మి రజతం, కె.నూకరత్నం, ఎస్.ప్రవీణ్‌కుమార్, యు.మధులత కాంస్య పతకాలు సాధించారన్నారు.బంగారు పతకాలు సాధించిన చిన్నారులు నార్వేలో జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యారన్నారు. కోచ్ పడాల నాగార్జునకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఆనందరావు, కోశాధికారి శ్రీనివాస్, బి.సురేష్‌రెడ్డి, ఎస్.ప్రశాంత్ పాల్గొన్నారు.

కులగణన సర్వేలో ఇబ్బందులు



సర్వే చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార, జనవరి 20: కులగణన సర్వే ప్రక్రియలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీతమ్మధార, నక్కవానిపాలెం ప్రాంతంలో సచివాలయం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఐరిస్ ద్వారా వివరాలు సేకరించారు. అయితే యాప్ ఆగితే తిరిగి ఓపెన్ కావడం లేదు. సర్వేలో ఒకరి వివరాలు నమోదుకు రెండుసార్లు బయోమెట్రిక్ వేయాల్సి వస్తోంది.

దుర్మార్గంగా జగన్ పాలన

... 5వ పేజీ తరువాయి

వస్తువుల ధరలు అనేక రేట్లు పెరిగిపోయాయన్నారు. కిలో బియ్యం రూ.40 నుంచి రూ.60కు, కందిపప్పు రూ.80 నుంచి రూ.160కు, చింతపండు రూ.122 నుంచి రూ.240కు పెరిగాయన్నారు. విద్యుత్ చార్జీలు ఐదు రెట్లు పెంచేశారని అన్నారు. తాము ఇంటింటికీ కేబుల్ టీవీ ప్రసారాలను రూ.149కి అందిస్తే ఇప్పుడు రూ.350కు పెంచారని ఆరోపించారు. చివరకు నాసిరకం మద్యం అమ్మకాల వల్ల 35 లక్షల మంది అనారోగ్యానికి గురికాగా, 30 వేల మంది చనిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మద్యం వ్యాపారం సీఎం చేస్తున్నారని ఆరోపించారు.

గత ఎన్నికల్లో జగన్‌ను నమ్మి ఓటేస్తే ఆయన గిరిజనుల గొంతు కోశారని చంద్రబాబునాయుడు ఆరోపించారు. అధికారంలోకి వచ్చినప్పటి ఇప్పటివరకూ గిరిజనులకు జగన్ ఒక్క మంచి పని అయినా చేశారా?...అని ప్రశ్నించారు. అదేమంటే బటన్ నొక్కుతున్నాను కదా అంటారని, గిరిజనుల కోసం ఏ బటన్ నొక్కారని నిలదీశారు. జగన్ సీఎం అయిన తరువాత గిరిజనులకు చెందిన మొత్తం 16 పథకాలు రద్దు చేశారని ఆరోపించారు. ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఉండాలని 2003లో తాము జీవో-3 తీసుకువచ్చామన్నారు. గిరిబిడ్డలకు అన్యాయం చేసేలా దానిని జగన్ రద్దు చేశారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో-3 అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. అన్ని రకాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక ప్రణాళిక రూపొందించి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. అరకు ప్రాంతంలో వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని, గిడ్డంగులు ఏర్పాటుచేసి ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంటు నెలకొల్పుతామని చెప్పారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అరకు కాఫీని ప్రమోట్ చేస్తే..వైసీపీ గంజాయ్‌ని ప్రమోట్ చేస్తోందని మండిపడ్డారు. విశాఖలో అల్లూరి సీతారామరాజు మ్యూజియం ఏర్పాటుకు నిర్ణయిస్తే దానిని మూలనపడేశారన్నారు. విశాఖలో రుషికొండకు బోడిగుండు చేసిన జగన్‌కు మరోసారి అధికారం ఇస్తే అరకు కొండలకు కూడా గుండు కొట్టిస్తారని హెచ్చరించారు. ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను తెలుగుదేశం వ్యతిరేకించిందని, వైసీపీ వచ్చిన తరువాత లేటరైట్ ముసుగులో బాక్సైట్ తవ్వుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఏజెన్సీలో లేటరైట్‌ను తవ్వి సీఎం సతీమణి భారతిరెడ్డికి చెందిన భారతి సిమెంట్ కంపెనీకి తరలిస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల సంపద దోచుకుంటున్న జగన్ ఈ ప్రాంతానికి ఒక్క రోడ్డు కూడా వేయలేదని వ్యాఖ్యానించారు. చివరకు వైద్యం కోసం ఫీడర్ అంబులెన్స్‌లు పోయి డోలీ మోతలపై ఆధారపడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు.

జగన్ మోసాలకు బలికావొద్దు

కులం, మతం పేరుతో జగన్ చేస్తున్న మోసాలకు ఎవరు బలికావద్దన్నారు. మతం, కులం, ప్రాంతం తిండిపెట్టవని, సుపరిపాలన, అభివృద్ధి ఫలాలు అందిస్తే ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. తాను పెత్తందారునని జగన్ విమర్శిస్తుంటారని, అయితే దేశంలోనే అత్యంత ధనవంతుడైన సీఎంగా ఆయనకు రికార్డు ఉందన్నారు. పేదల పక్షపాతిగా చెప్పుకుంటున్న జగన్ వేల కోట్ల ఆస్తులు సంపాదనకు ఏ మంత్రం జపిస్తున్నారో...దానిని చెబితే గిరిజనులు ధనవంతులవుతారని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కొత్త వేషంతో జగన్ వస్తారని పేర్కొంటూ ప్రజలంతా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

వాసుపల్లికి కార్పొరేటర్ల షాక్

... 5వ పేజీ తరువాయి

ఈ నెల 25న భీమిలిలో జరగనున్న ముఖ్యమంత్రి సభకు జన సమీకరణపై మాట్లాడేందుకు శనివారం వాసుపల్లి ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి 36వ వార్డు కార్పొరేటర్ పద్మావతి తప్ప మిగిలిన కార్పొరేటర్లు ఎవరూ హాజరుకాలేదు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో ఇండిపెండెంట్లుగా గెలిచి వైసీపీలో చేరిన ముగ్గురు కార్పొరేటర్లలో ఇద్దరు (కందుల నాగరాజు, సాదిక్) ఇప్పటికే పార్టీకి గుడ్‌బై చెప్పి, జనసేనలో చేరిపోయారు. ఇక టీడీపీ తరఫున గెలిచి ఆ తరువాత వైసీపీ పంచన చేరిన కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ కూడా ఈ సమావేశానికి రాలేదు. మరో కార్పొరేటర్ కోడూరు వెంకటరత్నం ఉరఫ్ కొండమ్మ కూడా గైర్హాజరయ్యారు. నియోజకవర్గంలో వైసీపీకి ఎనిమిది మంది ఉండగా ఒక్కరే రావడంతో కార్యకర్తల కూడా సంఖ్య కూడా తగ్గిపోయింది. ఆ వచ్చిన వారినే కూర్చోబెట్టి మాట్లాడారు.

పుంజుకున్న పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

బయలుదేరిపోతున్నారు. గతంలో చింతపల్లి మండలం లంబసింగిలో మాత్రమే మేఘాల లోకం ఆవిష్కృతమయ్యేది. ఆ తరువాత పాడేరు సమీపాన వంజంగి, అరకులోయ వద్ద మాడగడ కూడా సందర్శనీయ ప్రాంతాలుగా మారాయి. మరిన్ని ప్రాంతాలు అందుబాటులోకి రావడంతో సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది.

వంజంగికి వారం రోజుల విరామం

శీతాకాలంలో అక్టోబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఏజెన్సీకి సందర్శకులు పెద్ద సంఖ్యలో రావడం ఆనవాయితీ. ఈసారి డిసెంబరులో ఎక్కువ మంది రావడంతో సందర్శనీయ ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. రోజూ వేల సంఖ్యలు పర్యాటకులు రావడం, అందుకు తగ్గట్టుగా పారిశుద్ధ్య పనులు అక్కడ చేపట్టలేకపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వంజంగిలో సందర్శకులకు వారం రోజులు అనుమతించబోమని ఐటీడీఏ ప్రకటించింది. జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు ఎవరినీ అక్కడికి రానీయకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టింది. సుమారుగా ఎనిమిది లారీల ప్లాస్టిక్ వ్యర్థాలు, పార్శిల్ పొట్లాలు, ఇతరాలు వచ్చాయి.

విశాఖలో నేవీ మ్యూజియాలకు రద్దీ

విశాఖపట్నంలో కైలాసగిరితో పాటు ఆర్‌కే బీచ్‌లో నేవీ ఏర్పాటు చేసిన కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ-142, సీ హ్యారియర్ యుద్ధ విమాన మ్యూజియాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిని చూడడానికి పర్యాటకులు రెండు నుంచి మూడు కిలోమీటర్ల పొడవున క్యూలు కట్టి నిల్చొన్నారంటే అర్థం చేసుకోవచ్చు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు బెంగాలీలు ఎక్కువగా విశాఖ వస్తుంటారు. వారితో పాటు ఒడిశా, తెలంగాణా వారు కూడా జత కలిశారు.

ఉత్సవ్‌లు లేకున్నా...ఆదరణ

పర్యాటకులను ఆకర్షించడానికి విశాఖ ఉత్సవ్, అరకు ఉత్సవ్, భీమిలి ఉత్సవ్‌లతో పాటు వీఎంఆర్‌డీఏ ఫ్లవర్ షోలను జిల్లా యంత్రాంగం నిర్వహించేది. డిసెంబరులో జరిగే ఈ ఉత్సవ్‌లతోనే పండుగ వాతావరణం వచ్చేది. కరోనా తరువాత రాష్ట్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం మానేసింది. జిల్లా యంత్రాంగం కూడా ఖర్చుకు భయపడి, నిధులు లేక వెనకడుగు వేసింది. అయినా సరే పర్యాటకులు అధిక సంఖ్యలో రావడం గమనార్హం.

మందకొడిగా కులగణన

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి, వలంటీర్ వేలిముద్రలు వేయాలి. ఆ సమయంలో సర్వర్ మొరాయిస్తోంది. కొన్నిచోట్ల సిగ్నల్స్ లేక రోడ్లపైకి, ఇంటి మేడపైకి వెళ్లి వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇదిలావుండగా నగరంలో పలుచోట్ల సర్వే సిబ్బంది, వలంటీర్ వీధిలో ఒకచోట కూర్చుని అందరినీ అక్కడకు పిలిపించి వివరాలు నమోదు చేస్తున్నారు. ఫలానా చోటకు సిబ్బంది వస్తున్నందున కులగణన కోసం అందరూ అక్కడకు రావాలని వలంటీర్లు తమ పరిధిలోని వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్ పెడుతున్నారు. శనివారం సాయంత్రం వరకు 86,003 (12.024 శాతం) ఇళ్లకు సంబంధించి 1,97,583 మందిని (9.21 శాతం) సర్వే చేసి వివరాలు అప్‌లోడ్ చేశారు.

అల్లూరి సత్యనారాయణరాజు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, తదితరులు

సీతంపేట, జనవరి 20: అభ్యుదయ రచయిత సఘం ఆధ్వర్యంలో చారిత్రక నవలా రచయిత ఎన్‌డీవీ అజీజ్ రచించిన అల్లూరి సత్యనారాయణరాజు పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ శనివారం ఆవిష్కరించారు. పౌరగ్రంథాలయంలో అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగి కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ అజీజ్ సాహిత్య సేవకుడని, అల్లూరి జీవిత విశేషాలతో పాటు నాటి సామాజిక పరిస్థితులను స్వాతంత్ర్య ఉద్యమ నాటి సంఘటనలతో రచించడం శుభపరిణామం అన్నారు. న్యాయవాది అల్లూరి సీతారామరాజు, వెంకటపతిరాజు, రచయిత అజీజ్, బి.రాధారాణి, కేజీ వేణు, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, శ్యామసుందర్ రాజు, బొట్ట అప్పారావు, పోతన తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఫిడే రేటెడ్ ఓపెన్ చెస్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 20: చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి ఫిడే రేటెడ్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ జరగనుంది. ఎంవీపీ కాలనీలోని ఎస్3 స్పోర్ట్సు ఎరీనాలో జరిగే టోర్నీలో అన్ని వయసుల వారు పాల్గొనవచ్చునని టోర్నీ డైరెక్టర్ బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు రూ.4 లక్షల బహుమతులు అందించనున్నామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 23వ తేదీ లోగా 9989971232, 98493717140 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మద్యం సీసాలు

తగరపువలస, జనవరి 20 : చిట్టివలస సంతపేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మద్యం సీసాలు కనిపించడంతో స్థానికులు జడ్పీ రాముకు శనివారం ఫిర్యాదు చేశారు. కార్యకర్తలు సమ్మెలో ఉండడంతో కేంద్రం మూత పడింది. దీంతో ప్రతిరోజూ సాయంత్రం పరిసర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడికి వచ్చి మద్యం సేవించడం, పేకాట ఆడటం చేస్తున్నారు.అలాగే రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, జనవరి 20 : మండలంలోని గిడిజాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతు దృష్ట్యా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గుమ్మడివానిపాలెం, శొంఠ్యాం, గిడిజాల, వేముగొట్టిపాలెం, ముచ్చర్ల, తంగుడుబిల్లి, దిబ్బడిపాలెం, మిందివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 20 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం వైభవంగా జరిగింది వేకువజామున స్వామివారిని మేల్కొలిపి సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన అర్చకులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమశాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కులగణన సర్వే ప్రారంభం

మధురవాడ, జనవరి 20 : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలో శనివారం నుంచి కుల గణన ప్రారంభమైంది. సచివాలయం సిబ్బంది ఇంటింటికి వెళ్లి కులాల వారీగా వివరాలు నమోదు చేస్తున్నారు.కొన్ని ప్రాంతాల్లో వివరాలు సేకరిస్తున్న సిబ్బందికి ప్రజలు పలు ప్రశ్నలు వేస్తున్నారు. ఎన్నికల ముందు వివరాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇది అధికారికంగానే చేపడుతున్నామని సచివాలయ సిబ్బంది వారికి వివరణ ఇస్తున్నారు.

పద్మనాభంలో నెట్‌వర్క్ సమస్య

పద్మనాభం (రూరల్) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేకు నెట్ వర్క్ సమస్య వెంటాడుతోంది. మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లి, సామయ్యవలస, ఏనుగులపాలెం, మునివానిపాలెం గ్రామాల్లో శనివారం కుల గణనకు వెళ్లిన వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బందికి నెట్ వర్క్ రాకపోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అవస్థలు పడ్డారు. మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య ఉండడంతో అధికారులకు ఏం చేయాలో తెలియడం లేదు.

ఆలయ పరిసరాలు పరిశుభ్రత

సింహాచలం, జనవరి 20 :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయాలైన సీతారామస్వామి ఆలయంతో పాటు కొండదిగువ అప్పన్నస్వామి పూదోటలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉద్యోగులు శనివారం స్వచ్ఛ తీర్థ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం పారిశుధ్య విభాగం పర్యవేక్షణాధికారి లక్ష్మీప్రసన్న సారథ్యంలో సిబ్బంది పరిసరాలను శుభ్రపరిచి, మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత వల్ల వ్యాధులు దరి చేరవని చెప్పారు.

శిష్టకరణాల ఆత్మీయ సమావేశం

కొమ్మాది, జనవరి 20 : శిష్ట కరణాల ఆర్థిక, సామాజిక అభివృద్ధే తమ లక్ష్యమని ఆ కుల రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ డొంకాడ అనిల్‌కుమార్ అన్నారు. పీఎంపాలెంలో ఉన్న శిష్టకరణాల సేవా సంఘం కార్యాలయంలో శనివారం రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన సర్వేకు అధికారులు వచ్చినప్పుడు తమది బిసి-డి అని స్పష్టంగా తెలియచేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్‌కే మహంతి, రాష్ట్ర కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)

● **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారేట్ 36, దొండకాయలు 26, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 48 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30 , కంద 58, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 95
ఫారం ధర	-- 115
విత్ స్కిన్	-- 200
స్కిన్‌లెస్	-- 210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

ముడసర్లోవ పార్కు అభివృద్ధికి చర్యలు : కమిషనర్

ఎంవీపీ కాలనీ, జనవరి 20 : ముడసర్లోవ పార్కు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.శనివారం ఆయన ముడసర్లోవ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ముడసర్లోవ పార్కును చెట్లు దెబ్బతినకుండా అభివృద్ధి చేయాలన్నారు. ఆకర్షణీయమైన మొక్కలతో గార్డెన్, కెఫ్టేరియా, వాటర్ ఫౌంటెన్, వాకింగ్ ట్రాక్, హార్స్ రైడింగ్, విశ్రాంతి స్థలం, యోగా, జిమ్, తదితర సౌకర్యాలతో పాటు చిన్నారులకు ఆట స్థలానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే పాత పార్కులోని వ్యర్థాలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు శ్యామ్‌సన్ రాజు, జోనల్ కమిషనర్ కనకమహలక్ష్మి, అధికారులు గాజిబాబు, శాంతిరాజు, సురేష్ ఉన్నారు.



పార్కు పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



అదుపు తప్పి రెస్టారెంట్‌లోకి దూసుకువెళ్లిన కారు

భీమునిపట్నం, జనవరి 20 : బీచ్‌రోడ్ తొట్లకొండ వద్ద శనివారం ఒక కారు అదుపు తప్పి రెస్టారెంట్‌లోకి దూసుకువెళ్లింది. తొట్లకొండపై నుంచి కిందకు దిగుతున్న కారు వేగంగా వస్తూ నగరం వైపు మలుపు తిప్పే క్రమంలో అదుపు తప్పింది. దీంతో రహదారిని ఆనుకుని వున్న రెస్టారెంట్‌లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో కారులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వున్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

చిన్నవాల్తేరులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

పెదవాల్తేరు, జనవరి 20 : జీవీఎంసీ 20వ వార్డు చిన్న వాల్తేరు రజకవీధిలో టీడీపీ నాయకులు శనివారం భవిష్య త్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతనరెడ్డి, మురళి, దేవుడు, బాబు, నరేంద్ర, వాసు, తదితరులు పాల్గొన్నారు.

మిద్దె సాగుతో ఎన్నో ప్రయోజనాలు : తహసీల్దార్

మధురవాడ, జనవరి 20 : ప్రతిఒక్కరూ ఇంటిని వ్యవసాయ క్షేత్రంగా మార్చుకోవాలని రూరల్ మండల తహసీల్దార్ సనపల రమణయ్య అన్నారు. శనివారం ఆయన ఏడో వార్డు స్వతంత్రనగర్ కాలనీలో 60 గజాల మిద్దెపై బంగారు ర్యూన్సీ సాగు చేస్తున్న కూరగాయలు, పండ్ల తోటను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి కృత్రిమ ఎరువు వాడకుండా సేంద్రీయ ఎరువులతో కూరగాయలు, పండ్ల తోటను మిద్దెపై సాగు చేయడం అభినందనీయమ న్నారు. మిద్దె సాగు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ ఈ సాగుకు ఆసక్తి చూపాలని కోరారు.

దొంగ బంగారం కొంటే చర్యలు : సీఐ

తగరపువలస, జనవరి 20 : దొంగ బంగారం కొనుగోలు చేసినా.. అమ్మకం చేసినా కేసు నమోదు చేస్తామని భీమిలి క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాష్ హెచ్చరించారు. శనివారం ఆయన తగరపువలసలో బంగారు వర్తకులతో సమావేశం నిర్వహించారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. దుకాణాలకు తాళాలు వేసుకుని రాత్రి పూట కాపలా పెట్టాలన్నారు.

అప్పన్నను దర్శించిన కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయ ప్రధానార్చకుడు

సింహాచలం, జనవరి 20 : వారణాసిలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయ ప్రధానార్చకుడు ఓం ప్రకాష్ మిశ్రా, అర్చకులు థక్ నారాయణ, అన్నపూర్ణ ప్రసాద్, జయరామ్ శనివారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఓం ప్రకాష్ మిశ్రా ఎందరో మహానుభావుల కృషి వల్ల రామ్ లాల్ విగ్రహ పునఃప్రతిష్ఠ సాధ్యపడిందన్నారు. దేశవ్యాప్తంగా హైందవులంతా ముక్త కంఠంతో రామనామ జపం చేస్తున్నారన్నారు. కాగా అర్చక బృందానికి ఏఈఓ భ్రమరాంబ, పర్యవేక్షణాధికారి వెంకటరమణ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.

విప్రోత్సవం విజయవంతానికి సమష్టిగా కృషి

సింహాచలం,జనవరి 20 : నగరంలో వచ్చే నెలలో జరిగే విప్రోత్సవానికి బ్రాహ్మణులంతా సమష్టిగా కృషి చేయాలని సింహాచలం దేవస్థానం పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితుడు నరసింహమూర్తి పిలుపునిచ్చారు. శనివారం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో సింహాచలంలోని ప్రహ్లాద కల్యాణ మండపంలో విప్రోత్సవం సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత వచ్చేవిధంగా విప్రోత్సవానికి భారీ సంఖ్యలో హాజరవ్వాలన్నారు. సమావేశంలో బ్రాహ్మణ సమాఖ్యకు చెందిన కావూరి చరణ్, పూడిపెద్ది శర్మ, వంగూరి గణేష్, డీఎస్ఎస్ సాయి, రామభద్రుడు, వేమూరి మహేష్ పాల్గొన్నారు.

ఆందోళనకారులకు బెయిల్



జైలు బయట నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

ఎంవీపీ కాలనీ, జనవరి 20 : నగరంలోని ద్వారకానగర్‌లో బైజుస్ ట్యూషన్ సెంటర్ వద్ద ఈనెల 3న జరిగిన ఆందోళనలో పాల్గొన్న విద్యార్థి, యువజన నాయకులకు బెయిల్ రావడంతో శనివారం జైలు నుంచి విడుదలయ్యారు. వారికి సీపీఐ, విద్యార్థి, యువజన, మత్స్యకార, మహిళా సంఘాల నాయకులు జైలు బయట స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు మాట్లాడుతూ ఉద్యమాల్లో జైలుకు వెళ్లడం తమకు కొత్తేమీ కాదని, కానీ అక్రమాలపై ప్రశ్నించినందుకు జైలుకు పంపించడం ప్రభుత్వ దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై జరిగే ఉద్యమాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ఏఐవైఎఫ్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. లెనిన్‌బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు విమల, కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సెల్ లైట్లతో అంగన్‌వాడీల నిరసన



సెల్ లైట్ల వెలుతురులో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

భీమునిపట్నం, జనవరి 20 : పట్టణంలోని కృష్ణాకాలనీలో వున్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు శనివారం సెల్ లైట్ల వెలుతురులో నిరసన వ్యక్తం చేశారు. భీమిలి ప్రాజెక్టు పరిధిలో వున్న కార్యకర్తలు, ఆయాలు ఉదయం 9 నుంచి రాత్రి 7 వరకూ కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ భీమిలి డివిజన్ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీలు 40 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోగా, సమ్మె విచ్ఛిన్నానికి కుట్ర పన్నుతుందని ఆరోపించారు. ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టడానికి అధికారులు విధుల నుంచి వెళ్లేవరకూ చీకట్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ప్రాజెక్టు నాయకులు కె. వెంకటలక్ష్మి, శ్రీదేవి, పద్మ, సీఐటీయూ నాయకులు రవ్వ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

భీమునిపట్నం (రూరల్), జనవరి 20 : చిప్పాడలోని దివీస్ కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్న లావేటి దిలీప్‌కుమార్ (24) కొద్ది రోజులుగా కనిపించడం లేదని అతని తల్లి గన్నయ్యమ్మ భీమిలి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం జిల్లా గార మండలానికి చెందిన దిలీప్‌కుమార్ దివీస్‌లో పనిచేస్తూ భార్యతో కలిసి శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 16న కుటుంబంతో కలిసి అత్త వారింటికి శ్రీకాకుళం వెళ్లి తిరిగి 17న శ్రీరాంనగర్ వచ్చాడు. అప్పటి నుంచి అతని ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రాస్తారోకోలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు మూర్తి

తగరపువలసలో సీఐటీయూ రాస్తారోకో

తగరపువలస,జనవరి 20 : అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు మద్దతుగా సీఐటీయూ,అనుబంధ సంఘాల నాయకులు తగరపువలసలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ 40 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు కేంద్రాల్లో పోషకాహారం అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోనల్ కార్యదర్శి నర్సింగరావు, ఐద్వా కార్యదర్శి నాగరాణి, కుల వివక్ష సంఘం ఉపాధ్యక్షురాలు బి. లక్ష్మి, డీవైఎఫ్ఐ నాయకులు శ్రీనివాసవర్మ, తదితరులు పాల్గొన్నారు.

106 (2) జీవో రద్దు చేసే వరకూ పోరాటం



ధర్నాలో నినాదాలు చేస్తున్న లారీ డ్రైవర్లు

ఆనందపురం, జనవరి 20 : కేంద్రం ప్రభుత్వం లారీ డ్రైవర్లపై తీసుకువచ్చిన జీఓ నంబరు 106(2)ను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని లారీ డ్రైవర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యనారాయణ, అప్పారావు పేర్కొన్నారు. శనివారం తర్లువాడ జాతీయ రహదారి చెక్ పోస్టు వద్ద లారీ డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టకూటి కోసం డ్రైవర్ల వృత్తి చేపట్టి జీవనోపాధి పొందుతున్నామని, ప్రమాదవశాత్తు జరిగే సంఘటనలకు డ్రైవర్లను బాధ్యులను చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగితే డ్రైవర్లకు పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 7 లక్షల జరిమానా విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జీవోను రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు వి.అప్పలరాజు, జి. శ్రీను, అప్పారావు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి ఆలయంలో నూతన యాగశాల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నిర్మాణంలో ఉన్న నూతన యాగశాల

సింహాచలం, జనవరి 20 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయం సీతారామస్వామి ఆలయంలో నూతన యాగశాల నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రాములోరి ఆలయంపై చిన్న చూపేలా' అన్న శీర్షికతో వచ్చిన కథనానికి దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి స్పందిస్తూ ఇంజినీరింగ్ అధికారులను నూతన యాగశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈమేరకు ఈఈ బి. రాంబాబు సారథ్యంలో సిబ్బంది చెదలు పట్టిన పాత యాగశాలను పూర్తిగా తొలగించి,ఆ స్థానంలో నూతన యాగశాల నిర్మాణాన్ని ప్రారంభించారు. అలాగే ఆలయంపై ఆలయ పరిసరాల్లోని మొక్కలను తొలగించారు.

వరాహ పుష్కరిణి అభివృద్ధికి వినతి

సింహాచలం, జనవరి 20 : వరాహ పుష్కరిణి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ దేవస్థానం పాలక మండలి సభ్యుడు శ్రీనుబాబు ఆలయ ఇంజినీర్లకు శనివారం వినతిపత్రం అందించారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని,పరిసరాలను అభివృద్ధి చేసి ఉద్యానవనంగా తీర్చిదిద్దాలని కోరారు. అలాగే ఉత్తర దిక్కున ఉన్న శ్మశానవాటికకు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అభివృద్ధి చేయడానికి ముందుకు రావడంతో అనుమతి ఇవ్వాలన్నారు.

రేపు సాయి ఆలయ వార్షికోత్సవం

వెంకోజీపాలెం, జనవరి 20 : పాతవెంకోజీపాలెంలోని సీతారామాలయంలో వేంచేసి ఉన్న సరస్వతి, గురుదత్త సహిత సాయి మందిరం వార్షికోత్సవం సోమవారం జరగనున్నట్టు సీతారామ సేవా సంఘం అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం తెలిపారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచి సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నాభిషేకం, మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని చెప్పారు. అలాగే ఈనెల 23న గ్రామంలో పరస మహోత్సవం ఉంటుందన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆళ్వార్ దాస్‌కి నివాళి

కొమ్మాది, జనవరి 20 : పీఎంపాలెంలో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వాకర్స్ ఇంటర్నేషనల్ ఫౌండర్ సుంకరి ఆళ్వార్ దాస్ 21వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు జ్యోతి కమల ఆధ్వర్యంలో పలువురు ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరం మహిళలకు నడక పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిన్నారి,కోశాధికారి విజయలక్ష్మి, భ్రమరాంబ, రాజేశ్వరి, రోజా, సత్యవతి, గంటి లక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

సిరిపురం, జనవరి 20 : జీవీఎంసీ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ప్రతినిధులు కమిషనర్ సాయికాంత్‌వర్మకు శనివారం ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992 డీఎస్సీ ఉపాధ్యాయులను మొదలుకొని జీవీఎంసీ పరిధి, విశాఖ, భీమిలి, అనకాపల్లిలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. చిన్నబ్బాయి, టీఆర్ అంబేద్కర్, శ్రీలక్ష్మి, రాంబాబు, ఎం. రాజునాయుడు, శోభ పాల్గొన్నారు.

ఐక్య నిర్ణయాలతో హక్కుల సాధన

సిరిపురం, జనవరి 20 : ఐక్య నిర్ణయాలు, పోరాటాలతో హక్కుల సాధన సాధ్యమని అఖిల భారత తెలుకుల గాండ్లకు చెందిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు అన్నారు. శనివారం సాయంత్రం సిరిపురం మంత్రీస్ హోటల్‌లో అఖిల భారత తెలుకుల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ అందరూ సమష్టిగా ఉంటేనే ఏదైనా సాధించుకోగలమని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వీధి వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి చేయూత

పెదవాల్తేరు, జనవరి 20 : నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం స్ట్రీట్ వెంటర్స్ సెల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా స్ట్రీట్ వెండర్స్ సెల్ కన్వీనర్‌గా మధుపాడ లలితాకుమారి, కోకన్వీనర్‌గా కనిమెరక సత్తిబాబును నియమిస్తూ బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర నియామక పత్రాలు అందజేశారు. అలాగే విశాఖ జిల్లా కెమిస్ట్ సొసైటీ అధ్యక్షుడు బగ్గం శ్రీనివాసరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ప్రధాని మోదీ వీధి విక్రయదారుల వ్యాపార అభివృద్ధి కోసం ముద్ర రుణాలు, పీఎం స్వనిధి పథకం వంటివి ప్రవేశపెట్టారని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, వీధి విక్రయదారులు ఎం. నరేష్, మోహన్, త్రినాథ, కె. అప్పారావు, రమణ, వరలక్ష్మి, సంతోషి, గౌతమి, స్వాతి పాల్గొన్నారు.

బక్కన్నపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కొమ్మాది, జనవరి 20 : ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన ఆరో వార్డు బక్కన్నపాలెంలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి రూ. 20 లక్షల మంజూరయ్యాయని, ఆ నిధులతో వార్డుల్లో అభివృద్ధి పనులు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ముత్తంశెట్టి మహేష్, జడ్పీ కనక మహాలక్ష్మి, 5, 6 వార్డుల అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, పోతిన హనుమంతురావు, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, సూరిబాబు, సియాద్రి కనకరాజు, పోతిన శివ, ప్రసాద్ పాల్గొన్నారు.

24 నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు

భీమునిపట్నం, జనవరి 20 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మండల స్థాయి పోటీలు విజయవంతంగా ముగిసాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలస్థాయిలో విజేతలైన క్రీడాకారులకు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 30 వరకూ నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. అనంతరం పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ భీమిలి మినీ స్టేడియంలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఫస్ట్ ఎయిడ్ వైద్యం అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనరు బొడ్డేపల్లి రాము, ఎంపీడీవో డా. జానకి, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, ఏఎంసీ ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, పీఏసీఎస్ ఛైర్మన్ అక్కరమాని రామునాయుడు, ఎంఈవో శివరాణి, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి , తదితరులు పాల్గొన్నారు.